క్లుప్తంగా

ఈఓపీఆర్డీకి పదోన్నతి



పదోన్నతి పొందిన మణిమంజరి

జూపాడుబంగ్లా: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్డీగా విధులు నిర్వర్తిస్తున్న మణిమంజరికి ఎంపీడీఓగా పదోన్నతి లభించినట్లు ఎంపీడీఓ మంజులవాణి తెలిపారు. ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన పదోన్నతుల జాబితాలో మణిమంజరి పేరుండటంతో ఆమెను కార్యాలయ సిబ్బంది అభినందించారు. త్వరలో ఆమెకు ఎంపీడీఓగా స్థానం కేటాయిస్తారని చెప్పారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

పాములపాడు: మండలంలోని చెలిమిల్ల గ్రామంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో నిత్యావసర వస్తువులు కాలిబూడిదైన వెంకట లక్ష్మమ్మ కుటుంబానికి బీసీ సంఘం జిల్లా నాయకురాలు రమణమ్మ నిత్యావసర సరుకులు అందజేశారు. మాజీ ఎంపీటీసీ శివమ్మ ఆమెతో కలిసి ఆదివారం బాధితురాలిని పరామర్శించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు స్వామన్న ఉన్నారు.

తగ్గుముఖం పట్టిన డయేరియా



డయేరియా బాధితులతో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

వెలుగోడు: మండలంలోని గుంతకందాల గ్రామంలో డయేరియా తగ్గుముఖం పట్టింది. గ్రామానికి చెందిన పలువురు గత నాలుగు రోజులుగా విరేచనాలతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతుండగా ఆదివారం మరో నాలుగు కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో 9 మంది, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఇద్దరు, ప్రైవేట్ ఆసుపత్రిలో మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారని వేల్పనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి వంశీకృష్ణ తెలిపారు. గ్రామంలో వేల్పనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం కొనసాగిస్తున్నారు. వెలుగోడు నుంచి గ్రామానికి వచ్చే పైప్ లైన్‌కు పలు చోట్ల లీకేజీ అయిన కారణంగా నీరు కలుషితమై డయేరియా బారిన పడినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.

లేబర్ కోడ్ రద్దు చేయాలి

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తెచ్చిన లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, సీపీఎం నాయకుడు ఏసురత్నం కోరారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఆదివారం సీపీఎం,సీఐటీయూ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలనలో ప్రజలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. విభజన హామీలు, ప్రత్యేక హోదా ఏమైందని ప్రశ్నించారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన నిర్వాహకులను, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. నాయకులు రణధీర్, సురేంద్ర, నాగేంద్ర పాల్గొన్నారు.

మల్లన్న సేవలో..



రేపల శ్రీనివాసరావుకు ఆహ్వానం పలుకుతున్న ఆలయాధికారి

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను ఆదివారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ రేపల శ్రీనివాసరావు దర్శించుకున్నారు. క్షేత్రం చేరుకున్న ఆయనకు భ్రమరాంబా అతిథి గృహం వద్ద ఆలయాధికారులు ఆహ్వానం పలికారు. అనంతరం ఆయన స్వామిఅమ్మవార్ల దర్శనార్థం ప్రధానాలయ రాజగోపురం వద్దకు చేరుకోగా ఆలయాధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక,వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు,ప్రసాదాలు అందజేశారు.

ఆలయాల నిర్మాణాలకు సహకారం



బానుముక్కల చర్చిలో మాట్లాడుతున్న వేల్పుల ఆనంద్

పాములపాడు: రుద్రవరంలో నిర్మాణంలో ఉన్న శివాలయం, బానుముక్కల గ్రామంలోని చర్చి నిర్మాణాలకు తన వంతు సహకారం అందజేస్తానని కస్టమ్స్ ఆఫీసర్ వేల్పుల డేవిడ్ ఆనంద్ తెలిపారు. ఆదివారం మండలంలోని రుద్రవరం, పాములపాడు, జూటూరు, బానుముక్కల, ఇస్కాల, లింగాల గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీ, ఎస్సీ సంఘాల నాయకులు ఉన్నారు.

రికవరీ ఏమైంది?

- మూడు మండలాల్లో వందకు పైగా వ్యవసాయ మోటార్ల చోరీ
- దొంగలను పట్టించిన రైతులు
- కొన్ని మోటార్లు, రూ.3.80లక్షలు రికవరీ చేసిన పోలీసులు
- ఇప్పటి వరకు రైతులకు అందని వైనం
- ఖరీఫ్ ప్రారంభకానుండటంతో మోటార్ల కోసం అన్నదాతల ఎదురుచూపు



జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్

జూపాడుబంగ్లా: మండలలోని తరిగోపుల, పి.లింగాపురం, తూడిచెర్ల, రామసముద్రం, మండ్లెం, తరిగోపుల, తంగడంచ గ్రామాలతో పాటు పాములపాడు మండలంలోని మిట్టకందాల, వాడాల, ఏబీఆర్ కాల్వ వెంట ఉన్న గ్రామాలు, మిడుతూరు మండలంలోని అలగనూరు, చెరుకుచెర్ల తదితర గ్రామాల్లో వంద మోటార్ల వరకు దొంగలు ఎత్తుకెళ్లారు. మోటార్ల దొంగలను రైతులు పోలీసులకు అప్పగించి నెలరోజులు గడిచినా వారి మోటార్లు రికవరీ కాకపోవటంపై అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నెల 18న మోటార్లను చోరీ చేయడానికి వచ్చిన ఇద్దరు వ్యక్తులను రైతులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అదే నెలలో 21న విద్యుత్‌తీగల దొంగతనానికి వచ్చిన వారిని కూడా రైతులు పోలీసులకు అప్పగించారు. ఈ సమయంలో దొంగలను విచారించి వారి నుంచి మోటార్లు రికవరీ చేసి రైతులకు అప్పగిస్తామని పోలీసులు మాటిచ్చారని, అయితే నేటి వరకు వాటి ప్రస్తావనే లేదని వాపోతున్నారు. కొన్ని చోట్ల విద్యుత్ తీగలు కూడా చోరీ చేశారు. కాగా మోటార్లకు బదులు వారి నుంచి కొంత మొత్తం వసూలు చేసి అందజేస్తామని మరోసారి పోలీసులు హామీనిచ్చారు. ఇందులో భాగంగా దొంగల నుంచి పూర్తి స్థాయిలో మోటార్లు రికవరీ కాకపోవడంతో వారి నుంచి రూ.3.80 లక్షల నగదు రికవరీ చేసినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఆ మొత్తాన్ని బాధిత రైతులకు అందజేస్తామని చెప్పారని, హామీనిచ్చి నెల గడిచినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ పంటల సాగు ముంచుకొస్తున్న నేపథ్యంలో తమ మోటార్లు అందజేస్తే పంటలను సాగు చేసుకోవడానికి సులభమవుతుందని అన్నదాతలు చెబుతున్నారు.

ఆ నగదు ఏమైనట్లు?..

రైతులు పట్టించిన మోటార్ల దొంగలను విచారించిన పోలీసులు వారి నుంచి చోరీకి గురైన మోటార్లను రికవరీ చేసేందుకు యత్నించారు. వాటిలో కొన్ని మోటార్లు రికవరీ కాగా మిగిలిన వాటిని విక్రయించి సొమ్ము చేసుకొన్నట్లు తేలింది. దీంతో చోరీ చేసి విక్రయించిన మోటార్లకు సంబంధించి రూ.3.80 లక్షలను దొంగల నుంచి రికవరీ చేసినట్లు తెలుసింది. అయితే ఇప్పటి వరకు రికవరీ అయిన మోటార్లు, నగదు రైతులకు అందజేయకపోవటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇంజన్ ఇప్పిస్తామన్నారు



నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. ఆయిల్ ఇంజిన్‌తో బోరు నుంచి సాగునీటిని పారించుకొనొ పంటలు సాగు చేసుకుంటాను. కొద్ది రోజుల క్రితం మోటారు చోరీకి గురవటంతో విషయాన్ని పోలీసులకు తెలియజేశాను. దొంగలు పట్టుబడ్డారు. వారి నుంచి మోటారు రికవరీ చేసిస్తామని చెప్పారు. ఇప్పటి వదరకు మోటారు అందజేయ లేదు.

– వెంకటేశ్వర్లు, రైతు, పి.లింగాపురం

డబ్బులు, మోటారు ఇవ్వలేదు



మోటార్ల దొంగలను పట్టించి నెలరోజులు గడిచినా ఇప్పటిదాకా మా మోటార్లు రికవరీ చేసివ్వలేదు. మోటార్లకు బదులు డబ్బులు ఇప్పిస్తామన్నారు. అవి కూడా అందజేయలేదు. దొంగల నుంచి రికవరీ చేసిన రూ.3.80లక్షలు ఏమైందో తెలియదు.

– బోయశివన్న, రైతు, తూడిచెర్ల

డబ్బులు రికవరీ చేయలేదు



రైతులు పట్టించిన విద్యుత్ మోటార్ల దొంగలపై కేసులు నమోదు చేశాం. వారిని విచారించి వారిచ్చిన సమాచారం మేరకు ఓ మోటారును స్వాధీనం చేసుకొన్నాం తప్పా వారి వద్ద నుంచి పైసా కూడా రికవరీ చేయలేదు. త్వరలో రైతులకు న్యాయం జరిగేలా చేస్తాం.

– వెంకటసుబ్బయ్య, ఎస్‌ఐ, జూపాడుబంగ్లా

సాక్షిగణపతి వద్ద ట్రాఫిక్ జామ్



ఇరువైపులా నిలిచి పోయిన వాహనాలు

శ్రీశైలం: శిఖరం – శ్రీశైలం మధ్య ఉన్న సాక్షిగణపతి ఆలయ సమీపంలో వాహనాల రాకపోకలు స్తంభించాయి. దాదాపు రెండు గంటల పాటు భక్తులు అవస్థలు పడ్డారు. ఆదివారం సెలవు రోజు కావడం, ఇటీవల పది, ఇంటర్ ఫలితాలు వెలువడటంతో మొక్కుతీర్చేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడం, అదే సమయంలో శనివారం మల్లన్నను దర్శించుకున్న భక్తులు ఆదివారం తిరుగు ప్రయాణం కావడంతో ఈ మార్గంలో ట్రాఫిక్ జామ్ అయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు సాక్షి గణపతి ఆలయం వద్దకు చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ప్రార్థనా మందిరం ప్రారంభం

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలో ఆదివారం సెయింట్ లూకా ప్రార్థనా మందిరాన్ని ప్రారంభించారు. గతంలో సీఎస్ఐ చర్చిగా పిలవబడే ఈ మందిరాన్ని పునర్నిర్మించి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమానికి దక్షిణ రైట్ రెవరెండ్ బిషప్ ఎగ్గోని పుష్పలలిత హాజరయ్యారు. ముందుగా గ్రామానికి చేరుకున్న ఆమెకు ఘన స్వాగతం లభించింది. అనంతరం ఆమె ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పెరుమాళ్ల వరప్రసాద్‌బాబు, రెవరెండ్ చింతకరుణాకర్‌బాబు, పెరుమాళ్ల సాల్మోన్, రెవరెండ్ కృపాకర్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

మహానందిలో భక్తుల రద్దీ



మహానంది కోనేరులో స్నానాలాచరిస్తున్న భక్తులు



దర్శనం అనంతరం బయటికి వస్తున్న భక్తులు

మహానంది: క్షేత్రంలో ఆదివారం భక్తజన సందడి నెలకొంది. వేలాది సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ఆవరణలు కిటకిటలాడాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి వచ్చిన భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. భక్తుల రద్దీ నెలకొనడంతో వసతి గృహాలకు డిమాండ్ నెలకొంది. దేవస్థానానికి చెందిన వసతిగదులు నిండిపోవడంతో ప్రైవేటు లాడ్జీల యజమానులు సాధారణ రోజుల కంటే అధిక ధరలు వసూలు చేయడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. పట్టణాల తరహాలో లాడ్జీల వద్ద నిర్ణీత ధరలు వసూలు చేసేలా ధరలు సూచిస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలని భక్తులు కోరారు.

హక్కులను తెలియజేసేందుకే దీక్ష



జూపాడుబంగ్లాలో మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి, కమిటీ సభ్యులు

జూపాడుబంగ్లా: రాయలసీమ రైతాంగానికి ప్రజలకు సాగునీటి హక్కులను తెలియజేసేందుకే జలజాగరణ దీక్ష చేపడుతున్నామని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మండలంలోని మండ్లెం గ్రామంలో రైతులు చేపట్టిన జలదీక్షకు సంఘీభావం తెలిపారు. అనంతరం జూపాడుబంగ్లా, పారుమంచాల గ్రామాల్లోని రైతులను కలిసి వారిని చైతన్యపరిచారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిద్ధేశ్వరం అలుగు నిర్మాణానికి శంకుస్థాపన చేసి నేటికీ ఏడేళ్లు పూర్తైన సందర్భంగా రైతులను చైతన్య పర్చుతూ కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరం వద్ద ఈనెల 31న సాయంత్రం 6 నుంచి జూన్ 1తేదీ ఉదయం 10గంటల వరకు జల జాగరణదీక్ష చేపట్టనున్నట్లు చెప్పారు. నందికొట్కూరు నియోజకవర్గం చుట్టూ కృష్ణా జలాలున్నా ఎత్తిపోతల పథకాల్లేని కారణంగా నీటిని వినియోగించుకోలేని దుస్థితి నెలకొందన్నారు. సమితి కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్.వెంకటరెడ్డి, మోక్షేష్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

నందికొట్కూరు: ఈ నెల 31న నిర్వహించనున్న సిద్ధేశ్వరం జలజాగరణ దీక్షను జయప్రదం చేయాలని బొజ్జా దశరథరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ తీగల బ్రిడ్జికి బదులుగా అలుగు నిర్మించాలని డిమాండ్ చేశారు.

ఉత్తరాయణం లోపు కుంభాభిషేకం జరిపించాలి



స్వామిఅమ్మవార్ల దర్శనానంతరం బయటికి వస్తున్న మహాదేవ్ స్వామీజీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలో తలపెట్టిన మహా కుంభాభిషేకాన్ని ఉత్తరాయణ పుణ్యకాలంలోనే నిర్వహించాలని కామారెడ్డికి చెందిన మహదేవ్ స్వామీజీ తెలిపారు. ఆదివారం శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మల్లన్న దర్శనార్థ ఆలయం వద్దకు వచ్చిన స్వామీజీకి ఆలయాధికారులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం స్వామీజీ మల్లికార్జునస్వామికి అభిషేకం, భ్రమరాంబాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాయణ పుణ్యకాలంలోనే మహా కుంభాభిషేకాన్ని జరిపించాలని ప్రభుత్వానికి, ఈఓకి విన్నవిస్తున్నానని చెప్పారు.

కృత్రిమ అవయవాల పంపిణీ



కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: పట్టణ సమీపంలోని కాశీ ప్రసాద వృద్ధాశ్రమంలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను ఏపీ మానవ హక్కుల కమిషన్ సభ్యుడు, రిటైర్డ్ జడ్జీలు సుబ్రహ్మణ్యం, మోహన్‌రావు, శివప్రసాద్, మాజీ సర్పంచు నరసింహారెడ్డి ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పళ్లే ప్రియాంక సేవా సమితి, జువ్వాజి సుంకన్న గౌడు ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మానవ సేవలోనే ఆనందం ఉందన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వహకులు ధర్మారెడ్డి, పెద్దచెంచిరెడ్డి, శివరాముడు, అల్వాల బాలయ్య, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు అల్వాల సురేష్, రామిరెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మండ్లెంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య

జూపాడుబంగ్లా: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆదివారం మండ్లెం గ్రామంలో రాత్రి బస కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌చేసి బ్యాంకు ఖాతా నంబర్, ఆధార్ వివరాలు, ఓటీపీ అడిగితే ఇవ్వరాదని చెప్పారు. ప్రతి మహిళ తన సెల్‌ఫోన్‌లో దిశ యాప్‌ను కలిగి ఉండాలన్నారు. రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి ఆథరైజ్డ్ విత్తన దుకాణాల్లో నాణ్యమైన విత్తనాలు మాత్రమే కొనుగోలు చేసి రసీదులు దాచుకోవాలని కోరారు. పోలీసు సిబ్బంది ఉన్నారు. చిన్న ఘర్షణలను పెద్దవిగా చేసుకొని కేసుల వరకు వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని, సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని చెప్పారు. ఏదైనా ఇబ్బందులుంటే పోలీసులను సంప్రదించాలన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల్లో అభివృద్ధి

- బండిఆత్మకూరులో నలభై ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపిందెవరు?
- ఎమ్మెల్యే శిల్పాపై దుష్ప్రచారాన్ని ఖండించిన వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ దేసు వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

మహానంది: గ్రామాల అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని, అభివృద్ధి ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని బండిఆత్మకూరు మండల మాజీ అధ్యక్షుడు దేసు వెంకట్రామిరెడ్డి తెలిపారు. నంద్యాలలోని టీడీపీకి చెందిన ఓ ఛానల్‌లో ప్రసారమైన అసత్య ఆరోపణలపై ఆదివారం బండిఆత్మకూరులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు ఎక్కడికక్కడే పరిష్కారం అవుతున్నాయన్నారు. వీవర్స్ కాలనీలో నలభై ఏళ్ల నుంచి ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఎంతో కృషి చేశారని, రూ. కోటితో పనులు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో సుమారు 1968లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను ప్రస్తుతం మార్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. నాడు–నేడు ద్వారా పాఠశాలలు, ఆస్పత్రులను అభివృద్ధి చేసిందెవరని నిలదీశారు. తమ పార్టీలో ఎలాంటి విబేధాలు లేవని, అందరం కలిసికట్టుగా గ్రామాభివృద్ధికి పాటుపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డిపై దుష్ప్రచారాలు మానుకుని ప్రజల మన్ననలు పొందాలని హితవు పలికారు. వైస్ సర్పంచ్ అవుటాట నాగేశ్వరరెడ్డి, కాకనూరు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, యువనేత దీపకాంత్‌రెడ్డి, బాబురెడ్డి, చిన్నసుబ్బారెడ్డి, సీమ వెంకటసుబ్బారెడ్డి, దేసు మనోహర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నందిపాటి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

నందికొట్కూరు: ప్రభుత్వం మహిళల మరుగుదొడ్డి కోసం నిర్మించిన స్థలాన్ని విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి నరసింహులు కోరారు. ఆదివారం స్థానిక వాల్మీకి నగర్, వడ్డేపేటకు చెందిన మహిళల మరుగుదొడ్డికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 1979లో మహిళల మరుగుదొడ్డి కేటాయించిన స్థలాన్ని విక్రయించడం నేరమన్నారు. నాయకులు వెంకటేశ్వర్లు, స్థానిక మహిళలు ఈశ్వరమ్మ, మంగమ్మ, మహేశ్వరి, సావిత్రి పాల్గొన్నారు.

పెనుగాలులకు కూలిన విద్యుత్ స్తంభాలు



లక్ష్మాపురం అంచె వద్ద విరిగిన విద్యుత్ స్తంభం

పగిడ్యాల: ఇటీవల వీచిన ఈదురు గాలులకు మండలంలో విద్యుత్ విరిగి పడ్డాయి. దీంతో ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సమస్యను పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ సిబ్బంది శ్రమిస్తున్నారు. మొత్తం 26 స్తంభాలు పడిపోయాయని ఏఈ క్రాంతికుమార్ తెలిపారు. పగిడ్యాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మాపురం, పడమర ప్రాతకోట, ముచ్చుమర్రి ఫీడర్ల కింద వ్యవసాయ వినియోగదారులకు సరఫరా నిలిచిపోయిందని, త్వరలోనే పునరుద్ధరిస్తామని చెప్పారు.

త్వరలో కౌన్సిల్ మీట్

ఆత్మకూరు: మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామని కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కొన్ని పత్రికలు ఈ నెల 29వ తేదీన సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రచురించాయని, వాస్తవంగా ఇప్పటి వరకు తేదీని ప్రకటించలేదని, తప్పుడు ప్రకటన రావడం విచారకరమన్నారు. త్వరలోనే చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, కో ఆప్షన్‌సభ్యుడు రఫిక్, కౌన్సిలర్లతో చర్చించిన అనంతరం తేదీని ప్రకటిస్తామని చెప్పారు.

క్రీడాకారుడికి సన్మానం

ఆళ్లగడ్డ: పట్టణానికి చెందిన డీఎస్‌ఎన్ విశ్వనాథ్ ఈ ఏడాది మార్చి 27 నుంచి 31వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి సబ్‌జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాడు. ఆదివారం పట్టణంలోని శిల్పా వెంచర్‌లో డాక్టర్ రాంగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాపీ సండే కార్యక్రమంలో ఆళ్లగడ్డ సెబ్ సీఐ చంద్రావతి విశ్వనాథ్‌ను సన్మానించి ప్రశంసా పత్రం, మెడల్ అందజేశారు. రమణారెడ్డి, కోచ్‌లు సుబ్బరాయుడు, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

2 నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు

కొత్తపల్లి: జూన్ 2వ తేదీ నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయని, స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలను పరీక్ష కేంద్రంగా ప్రకటించారని ఎంఈఓ శ్రీరాములు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని, విద్యార్థులు నిర్ణీత సమయంలో పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

పర్యావరణ రక్షణపై అవగాహన



శిఖరేశ్వరం వద్ద పర్యావరణ పరిరక్షణపై భక్తులకు అవగాహన కల్పిస్తున్న అటవీ సిబ్బంది

ఆత్మకూరు: పర్యావరణ పరిరక్షణపై అటవీ శాఖ సిబ్బంది భక్తులకు అవగాహన కల్పించారు.ఆదివారం సున్నిపెంట, వైజాగ్ క్యాంప్, బండ్లబజార్ చర్చి, శిఖరం, ఫారెస్ట్ టోల్‌గేట్, హఠకేశ్వరం తదితర ప్రాంతాల్లో పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి నరసింహులు, సెక్షన్ ఆఫీసర్ మదన్‌కుమార్, భీమానాయక్, బీట్ ఆఫీసర్లు రవీంద్రనాథ్ ఠాగుర్, శ్రీరాములు ప్రొటెక్షన్ వాచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: బీసీల అభివృద్ధిని కాంక్షించి కులగణన కోసం కమిటీ ఏర్పాటు చేయాలని ప్రకటించడంపై శాలివాహన కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సుగురు రవణమ్మ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని సింగరాజుపల్లె గ్రామంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీసీల అభివృద్ధికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే కుల గణన చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. అందరూ సమానంగా వృద్ధి చెందాలనే సంకల్పంతో ఆరుగురుతో కులగణన కమిటీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు సాయిరాం పాల్గొన్నారు.

రుతు ప్రక్రియ సహజం



మాట్లాడుతున్న మెప్మా టీఎంసీ శాంతకుమారి

నందికొట్కూరు: మహిళల జీవితంలో రుతుక్రమం సహజ ప్రక్రియ అని మెప్మా టీఎంసీ శాంతకుమారి అన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి అంతర్జాతీయ రుతుక్రమం పరిశుభ్రతా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇంట్లోని పిల్లలకు రుతుక్రమంపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఆ సమయంలో పిల్లలకు మంచి బలమైన ఆహారం ఇవ్వాలని సూచించారు. మెప్మా ఈఓ అర్చన, టీఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు ప్రమీల, ఏఎన్‌ఎం లక్ష్మి, పొదుపు సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



ఆలయాన్ని అలంకరించిన దృశ్యం

జూపాడుబంగ్లా: మండలకేంద్రంలో వెలసిన శ్రీ సుంకులా పరమేశ్వరీదేవి ఆలయ తొమ్మిదవ వార్షికోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉదయం అర్చకులు గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహపూజ, అష్టదిక్పాలక పూజ, అమ్మవారికి అభిషేకం, మహామంగళహారతి వంటి పూజాధికాలతో ఉత్సవాలను ప్రారంభించారు. మూడు రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు.